నమస్తే తెలంగాణ
# కామారెడ్డి
5 | నిజామాబాద్, సోమవారం 12 ఆగస్టు 2024 | KAMAREDDY


దాస్‌నగర్‌లో కొనసాగుతున్న ఎంజేపీ రెసిడెన్షియల్ పాఠశాల

# అద్దె భవనాలు.. అరకొర వసతులు

- గురుకులం... అస్తవ్యస్తం
- ఏడాదికి రూ.19లక్షలకు పైగా కిరాయి చెల్లింపు
- ఇబ్బందుల్లో గురుకుల విద్యార్థినులు
- సమస్యల్లేవంటున్న అధికారులు

ఖలీల్‌వాడి, ఆగస్టు 11: గురుకుల విద్యాలయాలు అరకొర వసతులతో అస్తవ్యస్తంగా నడుస్తున్నాయి. అద్దె భవనాల్లో కొనసాగుతున్నా పర్యవేక్షణ అంతంత మాత్రంగానే ఉన్నది. అద్దె భవనాల్లో నడుస్తున్న ఒక్కో గురుకుల విద్యాలయానికి ప్రతి నెలా సుమారు రూ.లక్షా60వేలు ప్రభుత్వం చెల్లిస్తున్నా.. సౌకర్యాలు నామమాత్రంగానే కనిపిస్తున్నాయి. నవీపేట మండలానికి కేటాయించిన తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల నిజామాబాద్ నగరంలోని ప్రశాంతి హోమ్స్‌లో నిర్వహిస్తున్నారు. ఈ గురుకుల పాఠశాలకు గత కేసీఆర్ ప్రభుత్వం స్థల సేకరణ చేయగా, కొత్తగా వచ్చిన ప్రభుత్వం చొరవ తీసుకొని భవనాన్ని నిర్మించాల్సి ఉంది. కానీ, నిర్మాణ పనులు ప్రారంభించకపోవడంతో అద్దె భవనంలో కొనసాగుతున్నది.

### సమస్యల్లో దాస్‌నగర్ ఎంజేపీ..

నిజామాబాద్ అర్బన్‌కి చెందిన మహాత్మా జ్యోతి భాపూలే బీసీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల, కళాశాలను దాస్‌నగర్‌లో ఓ అద్దె భవనంలో నడుపుతున్నారు. ఇక్కడ సుమారు 800 మంది విద్యార్థినులు చదువుతున్నారు. వారం రోజులుగా బోరు మోటారు చెడిపోవడంతో నీటి సమస్యతో విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తినడానికి సరైన బియ్యం పంపిణీ చేయడం లేదనే విమర్శలు వస్తున్నాయి. మౌలిక సదుపాయాలపై అధికారుల పర్యవేక్షణ లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నది. 800 మంది విద్యార్థినులు ఉన్న చోట సరైన మైదానం లేదు. చుట్టూ పంట పొలాల మధ్యలో ఈ భవనం ఉన్నది. ఇదిలా ఉండగా 15రోజుల క్రితం తల్లిదండ్రుల సందర్శన సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ విద్యార్థినితో పాటు విద్యార్థినులకు చెందిన ఇద్దరు మృతి చెందిన విషయం తెలిసిందే.

### 530మందికి 16వాష్‌రూమ్‌లు..


మోపాల్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో మొత్తం 530 మంది విద్యార్థినులు చదువుతున్నారు. పెద్ద మొత్తంలో ఉన్న విద్యార్థినులందరికీ కలిపి 16 వాష్‌రూమ్‌లు మాత్రమే ఉన్నాయి. దీంతో విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం స్పందించి మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతున్నారు.


నిజామాబాద్‌లో కొనసాగుతున్న నవీపేట సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల

### మైదానం లేక ఇబ్బందులు పడుతున్నాం..

వానకురిస్తే వర్షపు నీరు, డ్రైనేజీ వాటర్ మైదానంలోకి చేరుతుంది. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికీ వర్షపు నీటితో ఇబ్బందులు పడుతున్నాం. అద్దె భవనం కావడంతో యజమానికి పలుమార్లు చెప్పాము..స్పందించకపోవడంతో ఉన్నతాధికారులకు నివేదించాం.

**- స్వప్న, ప్రిన్సిపాల్, బీసీ రెసిడెన్షియల్ గురుకుల పాఠశాల, దాస్‌నగర్**


ఖాళీగా ఉన్న పడకలు

పెద్దకొడప్‌గల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి జబ్బు చేసింది. కేంద్రంలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందడంలేదు. వైద్యులు, సిబ్బంది కొరత వేధిస్తుండడంతో రోగులు చేసేదిలేక.. ప్రైవేట్ దవాఖానలను ఆశ్రయిస్తున్నారు. గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యం అందించడానికి కోట్లు రూపాయలు ఖర్చు చేస్తున్నా..మెరుగైన వైద్యం పేదోడికి అందని ద్రాక్షలా మారింది. సౌకర్యాలు సరిగా లేకపోవడం ఒక ఎత్తయితే.. సమయానికి వైద్యం అందించే వైద్యులు,సిబ్బంది లేక రోగులు నానా అవస్థలు పడుతున్నారు.

-పెద్ద కొడప్‌గల్, ఆగస్టు 11

# పెద్దకొడప్‌గల్ పీహెచ్‌సీకి సుస్తీ!

- వేధిస్తున్న వైద్యులు, సిబ్బంది కొరత
- అందుబాటులో లేని అంబులెన్సు
- వసతులు లేక రోగుల అవస్థలు
- ప్రైవేట్ దవాఖానను ఆశ్రయిస్తున్న స్థానికులు



పెద్ద కొడప్‌గల్ పీహెచ్‌సీకి నిత్యం వంద మందికి పైగా రోగులు వస్తుంటారు. 24 గంటలూ ఇద్దరు వైద్యులు అందుబాటులో ఉండాలి. కానీ దవాఖాన ఏర్పాటు నుంచి ఒకే డాక్టర్‌ను నియమిస్తూ ఉన్నతాధికారులు చేతులు దులుపుకొంటున్నారు. వైద్యులు, సిబ్బంది లేక రోగులకు కుర్చీలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. పేదల వైద్యం కోసం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నామని ప్రభుత్వాలు చెబుతున్నా .. క్షేత్రస్థాయిలో అవి ఎక్కడా కనిపించడం లేదు. అత్యవసర పరిస్థితిలో వైద్యం కోసం ఇక్కడికి వస్తే వైద్యులు, సిబ్బంది లేకపోవడంతో ఎటువెళ్లాలో తెలియని పరిస్థితి నెలకొంది. మండలంలో మొత్తం 24 పంచాయతీలు ఉన్నాయి. ఇందులో 10 గ్రామ పంచాయతీలు గిరిజన తండాలు ఉన్నాయి. మండల కేంద్రానికి సుమారు 25 నుంచి 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న బాబుల్‌గాం, విఠల్‌వాడి, లింగంపల్లి, విఠల్‌వాడి తండా, పోచారం, పోచారం తండా, శివాపూర్,చావుని తండా, సముందర్ తండా, పెద్ద దేవీసింగ్ తండా, సీతారాంతండా, కుబ్యానాయక్ తండా తదితర గ్రామాలకు చెందిన ప్రజలు వైద్యం కోసం పీహెచ్‌సీకి వస్తారు. కానీ దవాఖానలో వైద్య సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో అటెండరే ఏవో మాత్రలు ఇవ్వడం, గాయలైన వారికి కట్టు కట్టి పంపిస్తున్నాడు. రాత్రివేళ అత్యవసర పరిస్థితుల్లో దవాఖానకు వస్తే వాచ్‌మన్ తప్ప ఎవరూ ఉండకపోవడం గమనార్హం. దీంతో ఆర్ఎంపీ, పీఎంపీలను ఆశ్రయిస్తున్నారు. ఒకవేళ బాన్సువాడ, నిజామాబాద్‌కు తీసుకెళ్దామనుకున్నా అప్పటి వరకు ప్రాణాలు ఉంటాయో లేదో తెలియని పరిస్థితి. ఇలా చాలా సందర్భాల్లో రోగులు ప్రాణాలు కోల్పోయిన ఘటనలు ఉన్నాయి. మండలంలోని రతన్ సింగ్ తండాకు చెందిన లాల్‌సింగ్ అనే వ్యక్తి రాత్రివేళ అత్యవసర పరిస్థితిలో ఓ రోగిని ప్రైవేట్ వాహనంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువచ్చారు. అక్కడ వాచ్‌మన్ తప్ప డాక్టర్, నర్సులెవరూ అందుబాటులో లేరు. కనీసం పీఎంపీ కూడా లేడు. సాయం కోసం ఎమ్మెల్యేకు ఫోన్ చేసినా స్పందన రాకపోవడంతో అదేరోజు రాత్రి నిజామాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు వెళ్లి ప్రాణాలు కాపాడారు.

### ఇలా వచ్చి.. అలా వెళ్తూ..

2014 ఏడాదికి ముందు వెంకటేశ్వర్లు అనే డాక్టర్ పీహెచ్‌సీలో ఐదేండ్లపాటు పనిచేసి వెళ్లిపోయారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు వైద్యులు దవాఖానకు అలా వచ్చి ఇలా వెళ్లిపోతున్నారు. దవాఖానలో 24 గంటలూ వైద్య సేవలందించడానికి ఇద్దరు డాక్టర్లు, ఆరుగురు స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మాసిస్ట్, సూపర్‌వైజర్, డాటా ఎంట్రీ అధికారి, అటెండర్, వాచ్‌మన్,ఏఎన్ఎంలు ఉండాలి. కానీ ప్రస్తుతం ఒక ఫార్మాసిస్ట్, స్టాఫ్‌నర్సు, ల్యాబ్ టెక్నీషియన్, అటెండర్, రాత్రి వాచ్‌మన్ మాత్రమే ఉన్నారు.


వైద్యం కోసం ఎదురు చూస్తున్న రోగులు (ఫైల్)


దవాఖానలో ఖాళీగా ఉన్న డాక్టర్ కుర్చీ

### కనీస సౌకర్యాలు కరువు...

దవాఖానలో కనీసం తాగునీరు కూడా లేకపోవడంతో గర్భిణులు, రోగులు అల్లాడిపోతున్నారు. తాగునీరు కోసం బస్టాండ్‌కు వెళ్లి వాటల్ బాటిళ్లను కొనుగోలు చేసుకుంటున్నట్లు రోగులు ఆవేదన వ్యక్తంచేశారు. మరుగుదొడ్లలో కూడా నీటి సౌకర్యం కల్పించకపోవడం గమనార్హం.

### ఇబ్బందులు పడుతున్నాం..



పెద్ద కొడప్‌గల్ పీహెచ్‌సీలో వైదులు,సిబ్బంది లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. పేదలు ప్రైవేట్ దవాఖానకు తీసుకెళ్లలేకపోతున్నారు. ఎమ్మెల్యే, కలెక్టర్ స్పందించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు, సిబ్బందిని నియమించాలని కోరుతున్నాం.

**-లాల్‌సింగ్, డ్రైవర్, రతన్ సింగ్ తండా**

### మంత్రి దృష్టికి తీసుకెళ్లాం..


పెద్ద కొడప్‌గల్ పీహెచ్‌సీ గురించి ఎమ్మెల్యే, మంత్రి దృష్టికి తీసుకెళ్లాం. కొత్తగా నాలుగువందల మంది వైద్య సిబ్బంది నియమించనున్నారు. ఇందులో నుంచి పీహెచ్‌సీకు తప్పకుండా కేటాయిస్తారు

**-చంద్రశేఖర్, డీఎంహెచ్‌వో కామారెడ్డి**

- రైతుల అభిప్రాయాల కోసం మంత్రుల పర్యటనలు
- ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ముఖం చాటేసిన వైనం
- తెలంగాణ వ్యాప్తంగా పర్యటించిన ఉప ముఖ్యమంత్రి
- పంటకాలం గడిచిపోతున్నా అభిప్రాయ సేకరణకే పరిమితం



# రైతుభరోసా మీటింగ్ ఎప్పుడో?



నిజామాబాద్, ఆగస్టు 11(నమస్తే తెలంగాణ ప్రతినిధి):

రైతు సంక్షేమం కోసం కేసీఆర్ హయాంలో మొదలుపెట్టిన పెట్టుబడి సాయం పథకానికి గ్రహణం పట్టుకున్నది. కాంగ్రెస్ పాలకులు ప్రభుత్వ బాధ్యతలు చేపట్టిన తర్వాత రైతుబంధు రూపంలో అమలయ్యే ఈ స్కీమ్ నిలుపుదలైంది. తొలుత సర్కారు వచ్చిన కొత్తలో యాసంగి సీజన్‌కు కేవలం ఐదు ఎకరాల్లోపు రైతులకు పెట్టుబడి సాయాన్ని అరకొరగా అందించారు. కానీ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం రైతుభరోసా రూపంలో అందాల్సిన మొత్తాన్ని మాత్రం రేవంత్ రెడ్డి సర్కారు అందించలేకపోయింది. కేసీఆర్ ప్రభుత్వంలో అమలైనట్లే ఏటా ఎకరానికి రూ.10వేల చొప్పున యాసంగిలో ఎకరానికి రూ.5వేలు రైతులకు పెట్టుబడి సాయాన్ని అందించారు. ప్రస్తుతం వానాకాలం మొదలై రెండు నెలలు దాటుతున్నా పెట్టుబడి సాయం మాత్రం ఊసేలేదు. ఈ వ్యవహారంపై ప్రభుత్వం ఓ కమిటీని నియమించింది. దీనికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సారథ్యం వహిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తూ రైతుల అభిప్రాయాలను తెలుసుకుంటున్నారు. అయితే ఈ భేటీలు చివరి అంకానికి చేరుకోగా ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు మాత్రం ఇప్పటికీ రాలేదు. జూలై 18న జరగాల్సిన భట్టి మీటింగ్ వాయిదా పడగా రైతులతో ముఖాముఖికి సంబంధించిన సమాచారం ప్రస్తుతం కరువైంది.

### అప్పులు చేసి సాగులోకి..

రైతుబంధుతో రైతులు రుణ విముక్తి పొందారు. కేసీఆర్ మూలంగా అమలైన ఈ పథకంతో పంటకాలం ప్రారంభంలోనే రైతులకు ఎంతో మేలు చేసేది. చేదోడు వాదోడుగా రైతుబంధు ఉపయుక్తమై నిలిచింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పథకం ఊసే కరువైంది. ఏమిటని ప్రశ్నిస్తే ఎవ్వరూ సమాధానం ఇవ్వడం లేదు. దీంతో ప్రభుత్వంపై ఆశలు చంపుకున్న రైతన్నలంతా చేసేది లేక వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు చేసి మరీ పెట్టుబడికి డబ్బులను సర్దుకుంటున్నారు. వాయిదా రూపంలో కొందరు, భూములు తనఖా పెట్టి మరికొందరు... ఇలా చాలా మంది ఇతరులపై ఆధారపడి పంట కాలానికి నగదును సమకూర్చుకున్నారు. ప్రభుత్వం మాత్రం చీమకుట్టినట్లైనా స్పందించకుండా నిబంధనల అమలు పేరుతో రైతుభరోసాను అమలు చేయడం లేదు. కాంగ్రెస్‌కు ఓటేసిన రైతులంతా ఎకరానికి రూ.15వేల కోసం ఎదురుచూస్తున్నప్పటికీ వారి ఆశలపై కాంగ్రెస్ సర్కారు నీళ్లు చల్లుతున్నది. కేసీఆర్ పాలనలో ఠంఛనుగా పెట్టుబడి సాయం అందిందంటూ మునుపటి రోజులను రైతులు గుర్తు చేసుకుంటున్నారు.

### ఎగవేత కోసమే తాత్సారం?

పెట్టుబడి సాయం ఎగవేత కోసమే ప్రభుత్వ వ్యూహం కింద కనిపిస్తున్నట్లుగా రైతులు భావిస్తున్నారు. రేవంత్‌రెడ్డి సర్కారు అమలు చేయాల్సిన రైతుభరోసా పేరిట ఎకరానికి రూ.15వేలు ఇవ్వాల్సి ఉంటుంది. కానీ పాలనాపగ్గాలు చేపట్టి ఎనిమిది నెలలు కావొస్తున్నప్పటికీ యాసంగి, వానాకాలం సీజన్‌లు వచ్చినప్పటికీ ఊసెత్తడం లేదు. రైతుల అభిప్రాయాలు తెలుసుకునేందుకు జిల్లాలు తిరుగుతున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తాత్సారం చేయకుండా వేగంగా మీటింగ్‌లు ఎందుకు పూర్తి చేయడం లేదో? ఎవరికి అర్థం కావడం లేదు. పైగా నిజామాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించాల్సిన సమావేశాన్ని ఉన్నట్టుండి వాయిదా వేశారు. రుణమాఫీ తొలి విడుత పథకం ప్రారంభోత్సవం ఉండడంతోనే నిజామాబాద్‌లో జరగాల్సిన రైతులతో భేటీ రద్దు చేసినట్లుగా ప్రకటించారు. రుణమాఫీ తర్వాత రెండో విడుత కూడా అమలైంది. పంద్రాగస్టుకు మూడో విడుత అమలుకు నోచుకోబోతోంది. కానీ రైతుభరోసా పేరిట నిజామాబాద్‌లో జరగాల్సిన మీటింగ్ మాత్రం నిర్వహించకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రైతుల అభిప్రాయాలను తెలుసుకునే ఎత్తుగడతో ఈ సీజన్‌ను దాటవేసి చేతులు దులుపుకొనేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్లుగా పలువురు చర్చించుకుంటున్నారు. సీజన్ ప్రారంభమై రెండు నెలలవుతున్నా ప్రభుత్వం ఇవ్వాల్సిన రైతుభరోసాకు విధివిధానాలను ఎంతకూ ఖరారు చేయకపోవడం ఏమిటంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు.

### కాలయాపన చేస్తున్నరు..



రైతుబంధుపై కాలయాపన చేస్తున్నట్లు అనిపిస్తుంది. ఎందుకంటే పంటలు వేసే సమయానికి రైతుబంధు వస్తే రైతు ఎంతో సంతోషంగా ఉంటాడో మాటల్లో చెప్పలేం. పోయిన సంవత్సరం వరకు ఫోన్ బెల్ ఎప్పుడు మోగుతుందా అని చూసేటోళ్లం. ఇప్పుడు రైతుబంధు వస్తుందా లేదా అన్న అనుమానం కలిగేలా ప్రభుత్వం వ్యవహరిస్తున్నది. పంట పెట్టుబడి కోసం చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తున్నది. అప్పు చేయాల్సిన పరిస్థితులు మళ్లీ మొదలయ్యాయి.

**- బాలమల్లేశ్, రైతు, వడ్యాట్**

### రైతుబంధు ఏదీ?



మోర్తాడ్, ఆగస్టు 11: గతంలో పంటలు వేస్తున్నామంటే వడ్డీ వ్యాపారుల దగ్గరకు చేయి చాపాల్సి వచ్చేది. అదే పరిస్థితి ఇప్పుడు ఏర్పడింది. కేసీఆర్ ఉన్నపుడు నాట్లు వేసే సమయానికి రైతుబంధు వచ్చేది. కూలీల ఖర్చులకు, ఎరువుల ఖర్చులకు ఎవ్వరినీ అడగాల్సిన అవసరం ఉండేదికాదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఎనిమిది నెలలవుతున్నది. వానాకాలం పంట మొదలై నెల దాటిపోయింది. అయినా రైతుబంధు రాలేదు. చేసేదేమి లేక మళ్లీ వడ్డీవ్యాపారుల దగ్గరకు వెళ్లాల్సి వస్తున్నది. ఇప్పటికైనా రైతుబంధు ఇచ్చి మమ్మల్ని ఆదుకోవాలి.

**- తాటిపల్లి శ్రీనివాస్, రైతు, దొన్కల్**


### తెలంగాణ తిరుమలలో కూలిన రిటైనింగ్ వాల్



నస్రుల్లాబాద్, ఆగస్టు 11: బీర్కూర్ శివారులోని తెలంగాణ తిరుమల తిరుపతి దేవస్థానానికి వెళ్లే దారిలో కొండపైన రిటైనింగ్ వాల్ కూలిన ఘటన ఆదివారం చోటు చేసుకున్నది. ఘటన సమయంలో భక్తులెవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. ఇటీవల కురిసిన వర్షాలకు దేవాలయం నుంచి దిగువ భాగంలో మట్టి కుంగి రిటైనింగ్ వాల్‌పై ఒత్తిడి పెరగడంతో కూలింది.

# హడలెత్తిస్తున్న కుక్కలు

- జనంపై దాడులు
- గ్రామాలు,పట్టణాల్లో శునకాల స్వైరవిహారం
- తాజాగా చేపూర్‌లో ఏడుగురిపై దాడి



పిచ్చికుక్కల దాడిలో గాయపడిన బాధితులు

ఆర్మూర్ టౌన్, ఆగస్టు 11 : నిజామాబాద్‌లో వీధి కుక్కల బెడద రోజురోజుకూ తీవ్రతరమవుతున్నది. జిల్లాలో ఎక్కడో ఒక చోట రోజూ జనం కుక్క కాటు గురవుతున్నారు. ఏ వైపు నుంచి వచ్చి కుక్క కాటు వేస్తుందోనని జనం హడలిపోతున్నారు. గ్రామాలు, పట్టణాల్లోనూ అదే పరిస్థితి నెలకొన్నది. ఏటా వేలాది మంది కుక్క కాటుకు గురవుతున్నారు. పట్టణాలు, గ్రామాల్లో కుక్కల సంఖ్య అధికమవుతున్నది. పగలు, రాత్రి అనే తేడా లేకుండా వీధుల్లో సంచరిస్తూ జనాలపై దాడి చేస్తున్నాయి. ఈ నెల 8న బోధన్ పట్టణంలోని హనుమాన్‌టేకిడీ కాలనీలో ఆడుకుంటున్న బాలుడిపై కుక్క దాడిచేసి గాయపర్చింది. ఈ ఘటనకు రెండు రోజుల ముందు ఇదే కాలనీలో ఆరుగురిని గాయపర్చినట్లు తెలిసింది. 6వ తేదీన ఎడపల్లి మండలం పోచారం గ్రామంలో పలువురిని పిచ్చికుక్కలు కరిచాయి. తాజాగా ఆర్మూర్ మండలం చేపూర్‌లో ఏడుగురిపై కుక్కలు దాడి చేసి గాయపర్చాయి. దీంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

### చేపూర్‌లో ఏడుగురిపై దాడి

ఆర్మూర్ మండలం చేపూర్ గ్రామంలో పిచ్చికుక్కలు స్వైర విహారం చేశాయి. గ్రామానికి చెందిన ఏడుగురిపై ఆదివారం ఉదయం పిచ్చి కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నా యి. చేపూర్ గ్రామానికి చెందిన వేల్పూ ల నర్సయ్య(50), కళ(30), పోసాని (60), లత(40), గంగారాం (60), భట్టు లాస్య(45), రాజగంగారాం (50)పై ఉదయం 10.30 గంటలకు కుక్కలు ఒకదాని వెనుక మరోటి గుంపులుగా వచ్చి దాడి చేశాయి. దాడిలో గాయపడిన వారిని స్థానికులు ఆర్మూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించగా ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండడంతో జిల్లా దవాఖానకు తరలించారు. చేపూర్‌లో కొన్ని రోజులుగా కుక్కలు స్వైర విహారం చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.